
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | శుక్రవారం 25, సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1

## డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు

- హైదరాబాద్, జహీరాబాద్‌లో 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- 8 మంది ఇళ్లలో కీలక పత్రాల స్వాధీనం
- బొమ్మ వెంకటేష్ ఇంట్లో రూ.1.35 కోట్ల అక్రమ నగదు గుర్తింపు
- భారీగా విదేశీ కరెన్సీ స్వాధీనం
- 14 లీటర్ల విదేశీ మద్యం కూడా పట్టివేత
- భీమ్‌రెడ్డితో ఆర్థిక లావాదేవీలపై ఆరా
- సోదాల్లో కీలక ఆధారాలు లభించాయన్న ఏసీబీ

2




## 22A భూములకు గ్రీన్ సిగ్నల్..

- 22A భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- GHMC, HMDA, DTCP లేఅవుట్లపై ఫోకస్
- పెండింగ్ రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- 22A సమస్యల పరిష్కారానికి హై లెవల్ కమిటీ

హైదరాబాద్, (ప్రజాస్వరం):

రాష్ట్రంలో దీర్ఘకాలంగా నలుగుతున్న 22A నిషేధిత భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలకమైన ప్రకటన చేసింది. నివాసిత ప్లాట్లు, లేఅవుట్లకు సంబంధించి జీహెచ్ఎంసీ (GHMC), హెచ్ఎమ్‌డీఏ (HMDA) లేదా డీటీసీపీ (DTCP) వంటి ప్రభుత్వ అధీకృత సంస్థల నుంచి అనుమతులు కలిగి ఉంటే.. సదరు భూములు 22A జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్లకు అనుమతి మిగతా 2లో..



## సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు ఎదురుదెబ్బ

- దానం పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- ఎమ్మెల్యే పదవికి దానం అనర్హుడేనని స్పష్టీకరణ
- పార్టీ మారిన తర్వాత మరో పార్టీ నుంచి పోటీపై చేయడంపై అభ్యంతరం
- ఘర్‌వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని వ్యాఖ్య
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం
- సుప్రీం తీర్పును స్వాగతించిన దానం నాగేందర్
- ప్రజాస్వరంలో తనకు బలముందని దానం వెల్లడి
- సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయమన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఫిరాయింపులపై పోరాటం కొనసాగిస్తామన్న బీజేపీ

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్యే పదవికి అనర్హతపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

దానం నాగేందర్ తొలుత బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మిగతా 2లో..



## క్షుద్ర పూజలంటూ తప్పుడు ప్రచారం

- సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామన్న కోర్టు
- కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శ
- ఆరు గ్యారంటీల అమలుపై హరీశ్‌రావు ప్రశ్న
- డిప్యూటీ స్పీకర్‌ను ఎందుకు నియమించలేదని నిలదీత
- దానం నాగేందర్ కేసులో సుప్రీం తీర్పు రేవంత్‌కు చెంపపెట్టని వ్యాఖ్య
- పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్‌గాంధీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- పార్టీ ఫిరాయింపులపై పోరాటం కొనసాగిస్తామన్న హరీశ్‌రావు

- కాంగ్రెస్ నేతలపై పరువు నష్టం కేసు వేశాను : హరీశ్ రావు
- మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌పై ఆధారాలతో పిటిషన్

2

## సుప్రీం తీర్పు చెంపపెట్టు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు
గుణపాఠమన్న కేంద్ర మంత్రి
రెండు పార్టీలూ
ఫిరాయింపులను
ప్రోత్సహిస్తున్నాయని విమర్శ
దానం నాగేందర్
వ్యవహారంలో బీజేపీ
న్యాయపోరాటం

హైదరాబాద్, (ప్రజాస్వరం):


పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు లాంటిదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పు అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠమని పేర్కొన్నారు.

దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు మిగతా 2లో..



## ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో ఊరట

ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాల వినియోగానికి అనుమతి
లావాదేవీలు చేసుకోవచ్చని కోర్టు స్పష్టీకరణ
ఖాతాల్లోని రూ.3 కోట్ల అన్‌ఫ్రీజ్‌కు నిరాకరణ
కుటుంబ పోషణకు ఇబ్బందులున్నాయని రవి పిటిషన్
8 రోజుల క్రితం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రవి
పైరసీ, బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై కేసులు
గత నవంబర్‌లో అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
ఫిబ్రవరిలో బెయిల్ మంజూరు
రూ.3 కోట్లను వినియోగించుకునేలా ఆదేశించాలని విజ్ఞప్తి
ఖాతాల వినియోగానికి మాత్రమే కోర్టు అనుమతి



2

## మేము ఎన్నికలకు భయపడం

- పవర్ ప్లాంట్ల పేరుతో బీఆర్ఎస్ అవినీతి: చామల
- యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై బీఆర్ఎస్‌కు చామల కౌంటర్
- కాంగ్రెస్ వచ్చాకే యాదాద్రి ప్లాంట్ పూర్తి వినియోగం
- విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లు దండుకున్నారని ఆరోపణ
- సింగరేణి బ్లాకులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు
- బీఆర్ఎస్ హయాంలో 18 గనులు మూసే పరిస్థితి: చామల

02



## దసరాలోపు పదవుల భర్తీ పూర్తి చేసే ఆలోచన

నామినేటెడ్ పదవుల భర్తీ రేపో మాపో అన్నంత దగ్గరికి
వాయిదా పర్వంతో కేడర్‌లో పెరుగుతున్న అసంతృప్తి
దసరా లోపు పదవుల భర్తీ పూర్తి చేసే ఆలోచన?
ఒకేసారి రెండు మూడు వేల మందికి పదవుల ప్రకటన
37 కార్పొరేషన్స్ ఛైర్మన్లలో ఐదుగురికే రెన్యువల్?

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణలో నామినేటెడ్ పదవు భర్తీ వ్యవహారం కొలిక్కి వచ్చిందా? ఇన్నాళ్లు ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్నా...ఇక సమయం లేదు మిత్రమా అంటున్నారా? ఆల్రెడీ లిస్ట్ మొత్తం సిద్ధమైపోయి కేవలం ఢిల్లీ స్టాంప్ కోసం ఎదురు చూస్తోందా? వాయిదాల కారణంగా పెరుగుతున్న అసంతృప్తిని పసిగట్టిన అగ్ర నాయకత్వం ఇక డూ ఫెస్టివల్ అంటోందా? ఇంతకీ భర్తీ ఎప్పుడు?

తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ కొలిక్కి వస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల హస్తినకు వెళ్లిన పిసిసి చీఫ్ మహేష్ గౌడ్...ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కొన్ని పదవులకు ఆమోద ముద్ర వేయించినట్టు చెప్పుకుంటున్నారు. భర్తీ విషయమై ఎప్పటికప్పుడు వాయిదా పర్వం నడుస్తున్న క్రమంలో కాంగ్రెస్ కేడర్ బాగా అసంతృప్తితో ఉంది. ఆ సంగతి గ్రహించిన అధిష్టానం వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉందట. అధికారంలో ఉండి కూడా.... పదవులు ఇవ్వకపోవడంతో వృధాగా కాలం గడిచిపోతోందన్న చర్చ పెరుగుతోంది. ఇన్నాళ్లు వాయిదా వేసిన ప్రతిసారి... ఈ నెలాఖరు వరకు అని చెప్పుకుంటూ మిగతా 2లో..

## రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్ మహమ్మద్-2026 పురస్కారం

బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపిక
రైతులు, బీసీలు, సామాన్యుల సంక్షేమానికి గుర్తింపుగా పురస్కారం
ప్రజాస్వామిక విలువలపై నిబద్ధతను ప్రశంసించిన జ్యూరీ
శుక్రవారం నిలంబూరులో అవార్డు ప్రదానం
ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా కార్యక్రమం
దివంగత కాంగ్రెస్ నేత స్మారకార్థం పురస్కారం ఏర్పాటు
తెలంగాణ పాలనలో చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపు
2026 సంవత్సరానికి రేవంత్‌రెడ్డి ఎంపిక
కేరళలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం
ఆర్యదాన్ మహమ్మద్ పేరుతో ఏటా పురస్కారం



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. ఆర్యదాన్ మహమ్మద్2026 అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ ఏడాది బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును రేవంత్‌రెడ్డికి అందించనున్నారు. శుక్రవారం కేరళలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుల జ్యూరీ వెల్లడించింది. ముఖ్యంగా రైతులు, బీసీలు, సామాన్య పౌరుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను జ్యూరీ ప్రస్తావించింది. ప్రజాస్వామిక విలువలపై సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతను కూడా ప్రశంసించింది.

### రైతులు, బీసీలకు ప్రాధాన్యం

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని జ్యూరీ పేర్కొంది. రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గుర్తించినట్లు తెలిపింది. బీసీల కోసం చేపట్టిన కార్యక్రమాలు, సామాజిక వర్గాల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. సామాన్య పౌరులకు ప్రయోజనం కలిగించే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడాన్ని కూడా అవార్డు మిగతా 2లో..

## డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు

- హైదరాబాద్, జహీరాబాద్‌లో 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- 8 మంది ఇళ్లలో కీలక పత్రాల స్వాధీనం
- బొమ్మ వెంకటేష్ ఇంట్లో రూ.1.35 కోట్ల అక్రమ నగదు గుర్తింపు
- భారీగా విదేశీ కరెన్సీ స్వాధీనం
- 14 లీటర్ల విదేశీ మద్యం కూడా పట్టివేత
- భీమ్‌రెడ్డితో ఆర్థిక లావాదేవీలపై ఆరా
- సోదాల్లో కీలక ఆధారాలు లభించాయన్న ఏసీబీ
- అక్రమ మద్యంపై ఎక్సైజ్ శాఖకు సమాచారం
- ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసు నమోదు
- అక్రమ ఆస్తుల కేసులో భీమ్‌రెడ్డి అరెస్టు

హైదరాబాద్, (ప్రజాస్వరం):
అక్రమ ఆస్తుల కేసులో అరెస్టైన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మంది ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, జహీరాబాద్‌లోని 10 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. భీమ్‌రెడ్డితో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న వారి ఇళ్లలో ఈ సోదాలు జరిగాయి. సోదాల్లో పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. భీమ్‌రెడ్డికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తులో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.

**రూ.1.35 కోట్ల అక్రమ నగదు**
బొమ్మ వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.1.35 కోట్ల అక్రమ నగదును గుర్తించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నగదుకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

**విదేశీ కరెన్సీ, మద్యం స్వాధీనం**
సోదాల్లో భారీగా విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో పాటు సుమారు 14 లీటర్ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.
అక్రమ మద్యం విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఎక్సైజ్ చట్టాల ప్రకారం సంబంధిత పోలీసులు కేసు నమోదు చేస్తారని వెల్లడించారు.

**భీమ్‌రెడ్డి ఆస్తులపై దర్యాప్తు**
డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో ఆయనతో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తుల ఇళ్లలో నూ సోదాలు నిర్వహించింది. తాజాగా లభించిన నగదు, పత్రాలు, ఇతర ఆధారాలను దర్యాప్తులో పరిశీలించనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.



## రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్ మహమ్మద్2026 పురస్కారం

మొదటిపేజీ తరువాయి

ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు తీసుకున్న చర్యలను జ్యూరీ ప్రశంసించింది.

**ప్రజాస్వామిక విలువలపై ప్రశంస**
పాలనా కార్యక్రమాలతో పాటు ప్రజాస్వామిక విలువలపై సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం, పాలనలో జవాబుదారీతనం వంటి అంశాలపై ఆయన అనుసరిస్తున్న విధానాలను గుర్తించినట్లు తెలిపింది.

**ఆర్యదాన్ మహమ్మద్ పేరుతో అవార్డు**
కేరళకు చెందిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ప్రజా జీవితాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి ఏడాది విశిష్ట ప్రజాసేవ చేసిన వ్యక్తికి బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును అందిస్తున్నారు.
ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ ఏడాది పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిలంబూరులో శుక్రవారం జరిగే కార్యక్రమంలో రేవంత్‌రెడ్డికి అవార్డును అందించనున్నారు.


**కేరళలో అవార్డు ప్రదానం**
ఆర్యదాన్ మహమ్మద్‌కు నిలంబూరుతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. ఆయన ప్రాతినిధ్యం వహించిన ప్రాంతంలోనే స్మారక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ప్రదానం చేయనున్నారు.
తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, పాలనా కార్యక్రమాలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. 2026 సంవత్సరానికి రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు జ్యూరీ ప్రకటించింది.

## మేము ఎన్నికలకు భయపడం

హైదరాబాద్, (ప్రజాస్వరం):
పవర్ ప్లాంట్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి చేశారని, ఇప్పుడు అదే థర్మల్ పవర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి గగ్గోలు పెడుతున్నారని భువనగిరి ఎంపీ, చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు సరఫరాకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సరైన చర్యలు తీసుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పూర్తి స్థాయి వినియోగంలోకి తెచ్చామన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లు దండుకున్నారని, సింగరేణిలో కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను బీఆర్ఎస్ హయాంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారు..18 గనులు మూతపడే పరిస్థితి బీఆర్ఎస్ హయాంలో వచ్చిందని ఎంపీ చామల విమర్శించారు. కాళేశ్వరం పరిస్థితి లాగానే థర్మల్ పవర్ ప్లాంట్ల పరిస్థితి ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెరిగిందన్నారు.
కొత్త గనులు సింగరేణికి వచ్చే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.. సింగరేణిలో బొగ్గు 90 శాతం రాష్ట్రానికి వాడుతున్నామని, దాదాపు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గులో 36 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రంలోని విద్యుత్ అవసరాలకు వాడుతున్నామని కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ నేతల ఫైల్స్ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయని, బీఆర్ఎస్ హయాంలో సింగరేణికి 35 వేల కోట్ల బకాయిలు పెట్టారు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాగ్ బుక్ లు చెక్ చేస్తే విద్యుత్ సప్లై రైతులకు 12 గంటలు కనీసం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. థర్మల్ పవర్ ప్లాంట్లను రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని, ఫామ్ హౌస్ లు కట్టుకోవడం పైనే బీఆర్ఎస్ నేతలు దృష్టి పెట్టారని ఆయన మండిపడ్డారు. విద్యుత్‌లో దోపిడీకి జగదీష్ రెడ్డి కారణమని, తెలంగాణ సమాజాన్ని బీఆర్ఎస్ పక్కదారి పట్టిస్తోందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా రైతులు ఇబ్బంది పడాలని కేటీఆర్ మొక్కులు మొక్కుతున్నారని ఆయన ఆరోపించారు.

**మేము ఎన్నికలకు భయపడం**
దానం నాగేందర్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, ప్రతి సందర్భంలో కోర్టులు జోక్యం చేసుకోవాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లేకుండా చేసినప్పుడు ఇలాంటి తీర్పులు వస్తే సంతోషం వ్యక్తం చేసే వాళ్ళమన్నారు. లోక్ సభలో, రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీలను బీజేపీలో చేర్చుకున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. తాము ఎన్నికలకు భయపడం, గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని, కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రెఫరెండం అన్నా కూడా ప్రజలు తమ పార్టీని గెలిపించారని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పై కోపం వస్తే తాను సీఎం కావాలని కేటీఆర్ కలలు కంటున్నారన్నారు.

# సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు ఎదురుదెబ్బ



మొదటిపేజీ తరువాయి

తరపున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడంపై వివాదం ఏర్పడింది.
ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు.. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజ్యాంగపరమైన నిషేధం ఏదీ లేదని ఆయన వాదించారు.
గతంలో బిహార్‌కు చెందిన మహాచంద్రప్రసాద్ కేసులో ఇచ్చిన తీర్పును మాత్రమే ఆధారంగా చేసుకుని తనను అనర్హుడిగా ప్రకటించడం సరికాదని దానం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

**ప్రజాస్వరంలో తేల్చుకుంటా**
సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. సుప్రీంకోర్టులో న్యాయపరంగా పోరాడటంలో తప్పులేదన్నారు. పదో షెడ్యూల్ ప్రకారం తనకు ఊరట లభిస్తుందని భావించానని చెప్పారు. అయితే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. తాను ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటానన్నారు.
ప్రజాస్వరంలో తనకు బలం ఉందని దానం చెప్పారు. తాను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సేవ చేశానన్నారు. తన గురించి ప్రజలను అడిగితే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్‌లో తాను గతంలో మూడుసార్లు గెలిచానని గుర్తు చేశారు.
ఉప ఎన్నికపై సీఎం స్పష్టత ఇస్తారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా పునరావృతమవుతాయని అన్నారు. ఖైరతాబాద్ తనకు బలమైన నియోజకవర్గమని చెప్పారు. కలిసి పనిచేస్తామని, తప్పకుండా గెలుస్తామని దానం పేర్కొన్నారు.

**బీజేపీ పోరాటాం ఫలించింది**
సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విజయమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు విషయంలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం కీలక పరిణామమని పేర్కొన్నారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని ఏలేటి అన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఫిరాయింపులను ప్రోత్సహించడం సరికాదని విమర్శించారు.
పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని ఏలేటి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న రాజ్యాంగపరమైన నిర్ణయాలపై కోర్టుల్లో, క్షేత్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

**ఉప ఎన్నికకు మార్గం**
సుప్రీంకోర్టు దానం నాగేందర్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. హైకోర్టు తీర్పు ప్రకారం దానం ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యారు. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి తదుపరి ఎన్నికపై ఎన్నికల సంఘం ప్రక్రియ కీలకం కానుంది.

## క్షుద్ర పూజలంటూ తప్పుడు ప్రచారం

- కాంగ్రెస్ నేతలపై పరువు నష్టం కేసు వేశాను : హరీశ్ రావు
- మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌పై ఆధారాలతో పిటిషన్
- సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామన్న కోర్టు
- కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శ
- ఆరు గ్యారంటీల అమలుపై హరీశ్‌రావు ప్రశ్న
- డిప్యూటీ స్పీకర్‌ను ఎందుకు నియమించలేదని నిలదీత
- దానం నాగేందర్ కేసులో సుప్రీం తీర్పు రేవంత్‌కు చెంపపెట్టని వ్యాఖ్య
- పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్‌గాంధీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- పార్టీ ఫిరాయింపులపై పోరాటం కొనసాగిస్తామన్న హరీశ్‌రావు

హైదరాబాద్, (ప్రజాస్వరం):
తనపై కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై ఆధారాలతో పరువు నష్టం కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద ఆయన మాట్లాడారు.
తన పిటిషన్‌ను కోర్టు అనుమతించిందని హరీశ్‌రావు చెప్పారు. సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తామని కోర్టు స్పష్టం చేసిందన్నారు. తనపై అసత్య ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా పోరాడుతానని తెలిపారు.

**డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపణ**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
తెలంగాణ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ నియామకం ఇప్పటివరకు జరగలేదని ఆరోపించారు. సభా హక్కుల ఉల్లంఘనపై నోటీసు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**దానం కేసుపై రేవంత్‌కు చెంపపెట్టు**
దానం నాగేందర్ అనర్హత కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు కీలకమన్నారు.
పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్‌కు ఎదురైన పరిణామం మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకూ ఎదురవుతుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అయినా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కనువిప్పు కలగాలని వ్యాఖ్యానించారు.

**రాహుల్‌గాంధీని ప్రశ్నించిన హరీశ్‌రావు**
లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం మాట్లాడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. మరి తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ఆయన వైఖరి ఏమిటని ప్రశ్నించారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు.

**స్పీకర్‌పై ఆరోపణలు**
పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రయత్నించారని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అబద్ధాలు ప్రచారం చేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు.తనపై మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ భవిష్యత్తులోనూ అసత్య ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హరీశ్‌రావు అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు.

## దసరాలోపు పదవుల భర్తీ పూర్తి చేసే ఆలోచన

మొదటిపేజీ తరువాయి

వస్తున్నారు పీసీసీ అధ్యక్షుడు.
ఇక మీదట ఇలాంటి స్టేట్మెంట్స్‌తో కాలం వెళ్ళదీయడం కష్టమైన పనిగానే కనిపిస్తోంది. దీంతో... దసరా లోపు పదవుల్ని భర్తీ చేయాలన్న ఆలోచనకు పార్టీ పెద్దలు వచ్చినట్టు తెలుస్తోంది. వివిధ సంస్థల డైరెక్టర్స్ నియామకం, కార్పొరేషన్ ఛైర్మన్స్ ఎంపిక కోసం ఇప్పటికే కొంత కసరత్తు జరిగింది. నియోజకవర్గాల వారీగా పేర్లు తీసుకుని లిస్ట్ సిద్ధం చేశారట. ఆ రకంగా ఒకే సారి.. రెండు.. మూడు వేల మంది పార్టీ నాయకులకు పదవులు ఇచ్చి పండగ వాతావరణం కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.
సాధారణంగా పార్టీలో పదవుల భర్తీ వ్యవహారాన్ని PCC చీఫ్ మహేష్ గౌడ్... సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ పర్యవేక్షిస్తారు. ఈ క్రమంలో ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి ఆశావహుల జాబితా సిద్ధంగా ఉంది కాబట్టి...త్వరలోనే ఢిల్లీకి వెళ్ళి ఆమోదముద్ర వేయించే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే... పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తల్లో ఇచ్చిన 37 కార్పొరేషన్ల ఛైర్మన్స్ పదవీ కాలం ముగిసింది. వీరిలో కొందరికి రెన్యువల్ చేయాల్సి ఉంది. ఆ రెన్యువల్ జాబితాపై కూడా వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవచ్చని అంటున్నారు. మహా... అయితే వాళ్ళలో ఐదుగురికి మించి తిరిగి ఇవ్వకపోవచ్చని అంటున్నారు. ఏది ఏమైనా.... అన్నిటినీ కలిపి ఒకేసారి అతి త్వరలోనే లిస్ట్ విడుదల చేయవచ్చంటున్నారు. సో... కాంగ్రెస్ లీడర్స్..... దూ ఫెస్టివల్.

## సుప్రీం తీర్పు చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి

ఫిరాయింపుల రాజకీయాలకు స్పష్టమైన సందేశమని కిషన్‌రెడ్డి అన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరడం, ఆ పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం ప్రజా తీర్పును గౌరవించకపోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.
2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారని పేర్కొన్నారు.
దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని భాజపా న్యాయపోరాటం చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. దానం ఎమ్మెల్యే పదవికి అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందన్నారు. దానం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిందని చెప్పారు.
గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుని మంత్రులను చేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకుని ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించడం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాటిని వ్యతిరేకించడం రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.
ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మార్చుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులను రెండు పార్టీలు రాజకీయ సంస్కృతిగా మార్చాయని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ఈ విధానానికి హెచ్చరిక అని పేర్కొన్నారు.దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఉప ఎన్నికలో ప్రజలు తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం వస్తుందన్నారు. ఫిరాయింపు రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెబుతారని చెప్పారు.ఖైరతాబాద్ ఉప ఎన్నికలో భాజపా ఘన విజయం సాధిస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రెండు పార్టీల ఫిరాయింపు రాజకీయాలకు ప్రజలు సమాధానం చెబుతారని అన్నారు.దానం నాగేందర్ తొలుత బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు.

## ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో ఊరట

- ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాల వినియోగానికి అనుమతి
- లావాదేవీలు చేసుకోవచ్చని కోర్టు స్పష్టీకరణ
- ఖాతాల్లోని రూ.3 కోట్ల అన్‌ఫ్రీజ్‌కు నిరాకరణ
- కుటుంబ పోషణకు ఇబ్బందులున్నాయని రవి పిటిషన్
- 8 రోజుల క్రితం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన రవి
- పైరసీ, బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై కేసులు
- గత నవంబర్‌లో అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- ఫిబ్రవరిలో బెయిల్ మంజూరు
- రూ.3 కోట్లను వినియోగించుకునేలా ఆదేశించాలని విజ్ఞప్తి
- ఖాతాల వినియోగానికి మాత్రమే కోర్టు అనుమతి

హైదరాబాద్, (ప్రజాస్వరం):
ఐబొమ్మ ఇమ్మడి రవికి నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. పోలీసులు ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను రవి తన సాధారణ లావాదేవీల కోసం ఉపయోగించుకోవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. అయితే ఆ ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేసేందుకు మాత్రం కోర్టు నిరాకరించింది. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నానని పేర్కొంటూ ఇమ్మడి రవి 8 రోజుల క్రితం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తన బ్యాంకు ఖాతాల్లో పోలీసులు ఫ్రీజ్ చేసిన రూ.3 కోట్లను వినియోగించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరాడు. అయితే నగదును అన్‌ఫ్రీజ్ చేయాలన్న అభ్యర్థనను కోర్టు అంగీకరించలేదు.
బ్యాంకు ఖాతాలను మాత్రం ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఖాతాల్లోని నగదుపై ప్రస్తుతానికి ఎలాంటి హక్కు వినియోగించుకునే అవకాశం లేదని కోర్టు నిర్ణయించింది.ఇమ్మడి రవిపై పైరసీకి పాల్పడి సినిమా పరిశ్రమకు భారీగా నష్టం కలిగించారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసి కోట్ల రూపాయలు సంపాదించారన్న ఆరోపణలపై హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసులో పోలీసులు గత నవంబర్‌లో ఇమ్మడి రవిని అరెస్టు చేశారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో బెయిల్ లభించింది. అరెస్టు సమయంలో అతడి బ్యాంకు ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేశారు.
ఆ ఖాతాల్లోని రూ.3 కోట్లను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరుతూ ఇమ్మడి రవి తాజాగా కోర్టును ఆశ్రయించాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అయితే కోర్టు ఖాతాల వినియోగానికి మాత్రమే అనుమతించింది. రూ.3 కోట్లను అన్‌ఫ్రీజ్ చేసేందుకు నిరాకరించింది.

## 22A భూములకు గ్రీన్ సిగ్నల్..

మొదటిపేజీ తరువాయి

ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జారీ చేసిన ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.
లక్షలాది మందికి లభించిన అపార ఊరట
ప్రభుత్వం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్లాట్ల యజమానులకు, సామాన్య గృహ వినియోగదారులకు అపారమైన ఊరట లభించింది. గతంలో నిబంధనల ప్రకారం మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థల నుంచి అనుమతులు పొంది ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయా సర్వే నంబర్లు 22A నిషేధిత జాబితాలో ఉండటం వల్ల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. తమ సొంత ఆస్తులను అమ్ముకోలేక, ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయలేక తీవ్ర మానసిక, ఆర్థిక వేదన అనుభవిస్తున్న బాధితులకు ప్రభుత్వ కొత్త ఆదేశాలు కొండంత ఉపశమనాన్ని ఇచ్చాయి.

**తక్షణమే అమల్లోకి ఆదేశాలు.. వేగవంతం కానున్న రిజిస్ట్రేషన్లు**
ప్రభుత్వ తాజా నిర్ణయంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిలిచిపోయిన వేలాది ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు మార్గం సుగమమైంది. చెల్లుబాటు అయ్యే అనుమతి పత్రాలు (Approved Layout Plans) కలిగిన భూయజమానులు ఇకపై ఎలాంటి చట్టపరమైన ఆటంకాలు లేకుండా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ రంగానికి నూతనోత్తేజం కలగడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో గణనీయమైన రాబడి సమకూరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## మేడ్చల్:గుర్తుతెలియని మృతదేహం.. గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

**ప్రజాస్వరం,మేడ్చల్:**

మేడ్చల్ PS పరిధిలోని రేకుల బావి చౌరస్తా వద్ద ఎన్‌హెచ్ 44 పక్కన ఉన్న చిన్న కాలువలో సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతుడి ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో వివరాలు తెలియరాలేదు.మృతుడు నల్లటి లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మృతుడిని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే వెంటనే మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కె. భాను చందర్ కోరారు. సమాచారం కోసం 8712571843 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.




## గణేష్ నిమజ్జనంలో అపశృతి...

- **కాలువలో పడిపోయిన కమిండ్ల గణేష్..**
- **పోలీసులు, ఫైర్ సిబ్బందితో గాలింపు**

**మాసాయిపేట , సెప్టెంబర్ 24:**


గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిమజ్జనం సందర్భంగా కమిండ్ల గణేష్ ప్రమాదవశాత్తు హల్దీ ప్రాజెక్టు కాలువలో పడిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.
ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో గణేష్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా, గణేష్ ఇటీవలే తన చెల్లెలి వివాహాన్ని జరిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిమజ్జన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి



## ప్రశాంతంగా వినాయక నిమర్జనం నిర్వహించుకోవాలి: మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్

**జవహర్ నగర్ సెప్టెంబర్ 24,(ప్రజాస్వరం):**


తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన విగ్నేశ్వరుని నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ నియర్ రెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం బాలాజీ నగర్ లోని వివిధ కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు పాటిస్తూ సంతోషంగా నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంపై సమావేశం

**సిద్దిపేట, ప్రజాస్వరం:**

గురువారం రోజున కలెక్టర్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమం గురించి సంబంధిత అధికారులతో చర్చించడం మరియు.
కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై చర్చించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై మాట్లాటం మరియు చర్చించుకోవడం జరిగింది అని సిద్దిపేట పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజు తెలియజేశారు. తదంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కి ఘన నివాళులు. అర్పించారు.



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- **లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్**
- **ఎస్ఐఆర్‌పై ఈసీలో విభేదాలు తీవ్రంగా ఉన్నాయని ఆరోపణ**
- **ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం చెప్పారన్న రాహుల్**
- **'ఓటు చోరీ'పై కాంగ్రెస్ ప్రశ్నించిన తర్వాతే విభేదాలు**
- **జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలని వ్యాఖ్య**
- **దేశ ప్రయోజనాల కోసం ఇది అవసరమని వెల్లడి**
- **సీఈసీ ఎంపికపై ప్రధాని, హోంమంత్రిపై విమర్శలు**
- **ప్రస్తుత గందరగోళానికి జ్ఞానేశ్ కుమారే కారణమని ఆరోపణ**
- **ఎన్నికల్లో గెలిచిన ఎంపీల చట్టాలపై సంచలన వ్యాఖ్య**
- **ఢిల్లీలో మీడియా సమావేశంలో లోక్‌సభలో విపక్ష నేత**
- **ఎన్నికల వ్యవస్థపై పోరాటం కొనసాగిస్తామన్న రాహుల్**

**ఢిల్లీ, (ప్రజాస్వరం):**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ఎన్నికల సంఘంలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రస్తుత గందరగోళానికి జ్ఞానేశ్ కుమారే కారణమని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు చెబుతున్నారని రాహుల్ ఆరోపించారు.
ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తాజాగా వెల్లడించింది. సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు అంశాలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. 10 నెలల్లో కనీసం 14 సార్లు వారు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపింది.
అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను మరో కోణంలో వివరించింది. గత 10 నెలల్లో ఈసీ తీసుకున్న నిర్ణయాలు ఏకగ్రీవంగానే ఉన్నాయని పేర్కొంది. కొన్ని అంతర్గత నోట్లను మాత్రమే చూపించడం వల్ల మొత్తం ప్రక్రియలోని మరో కోణం కనిపించకుండా పోతుందని తెలిపింది.
ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో 'ఓటు చోరీ' జరిగిందని కాంగ్రెస్ ప్రశ్నించిన తర్వాతే ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆయన ఆరోపించారు.
జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలని రాహుల్ అన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఆయన నిజాలు బయటపెట్టాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.
జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికల సంఘంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఆయన్ను ఎంపిక చేసిన వారే బాధ్యత తీసుకోవాలని అన్నారు.
ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు తీసుకొచ్చే చట్టాలు చెల్లవని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎస్ఐఆర్ విషయంలో ఈసీలో తలెత్తిన అంతర్గత అభ్యంతరాలు ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈసీలోని అంతర్గత వ్యవహారాలపై అధికారికంగా మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

# ఘనంగా భద్రా రెడ్డి జన్మదిన వేడుకలు

- **విద్యార్థులకు బుక్కులు, పెన్నులు పంపిణీ చేసిన తుడుం గణేష్**

**ప్రజాస్వరం,మేడ్చల్:**

ఎంతో మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన నాయకుడు, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు చామకూర భద్రారెడ్డి అని మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ కొనియాడారు. భద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా తుడుం గణేష్ ఆధ్వర్యంలో భద్రారెడ్డి ని కలిసి కేక్ కట్ చేయించి, శాలువాతో, గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పూడూరు కిస్టాపూర్ డివిజన్ కిస్టాపూర్ లోని ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్కలను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుడుం గణేష్ మాట్లాడుతూ తండ్రి మల్లారెడ్డి కి తనయుడిగా సేవాభావంతో ముందుకు పోతున్న నాయకుడు భద్రారెడ్డి అని కొనియాడారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. అటు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడిగా పార్టీ అభివృద్ధి కి కృషి చేశారన్నారు. ఈరోజు పూడూర్ కిష్టాపూర్ కార్పొరేషన్ పరిధిలో కిష్టాపూర్ లో ప్రైమరీ స్కూల్లో ఈరోజు మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా స్కూల్లో పిల్లలకు బుక్స్ పంపిణీ పెన్నులు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా కేక్ కట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్, సాయి గౌడ్, కాశి, శ్యామ్, నరసింహ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ తొలి క్యూబ్ శాటిలైట్ రూపొందించిన విద్యార్థులు

**ప్రజాస్వరం,మేడ్చల్**

తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా క్యూబ్ శాటిలైట్‌ను కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ విద్యార్థులు రూపొందించారు. శాన్సి ఆర్‌ఎఫ్ కమ్యూనికేషన్ సహకారంతో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో 134 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
విద్యార్థులను 10 బృందాలుగా విభజించి శాటిలైట్‌లోని వివిధ భాగాలను రూపొందించి, వాటిని అనుసంధానించి పూర్తి స్థాయి క్యూబ్ శాటిలైట్‌ను సిద్ధం చేశారు. చివరి రోజు నిర్వహించిన పరీక్షల్లో శాటిలైట్ ద్వారా సమాచారాన్ని విజయవంతంగా ప్రసారం చేయడంతో పాటు స్వీకరించారు.
అనంతరం విద్యార్థులు, శాన్సి ఆర్‌ఎఫ్ కమ్యూనికేషన్ ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన తెలంగాణ తొలి క్యూబ్ శాటిలైట్‌ను సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ సీహెచ్. గోపాల్ రెడ్డి, డైరెక్టర్ రాజి రెడ్డిలకు అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, శాన్సి ఆర్‌ఎఫ్ కమ్యూనికేషన్ బృందాన్ని చైర్మన్ అభినందించారు. నూతన ఆవిష్కరణలకు సీఎంఆర్ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# చెరువు కట్టను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న సర్పంచ్

**మసాయిపేట / తూప్రాన్ సెప్టెంబర్ 25**

మెదక్ జిల్లా వెంకటాయపల్లి గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ సర్పంచ్ బండకాడి హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో చెరువు కట్టపై ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెరువు కట్టపై పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, పొదలను ట్రాక్టర్ డోజర్ సహాయంతో తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.
చెరువు కట్టపై గడ్డి, పిచ్చి మొక్కలు అధికంగా పెరగడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. చెరువు కట్ట పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు శుభ్రత కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.
గ్రామంలోని ప్రధాన ప్రాంతాలు, చెరువు పరిసరాలు, రహదారుల వద్ద పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ హరీష్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ లో రూ.53 వేలు పలికిన లడ్డు వేలం

- **లడ్డూను దక్కించుకున్న లింగ అవినాష్**

**ప్రజాస్వరం,మేడ్చల్**

వర్గల్ శ్రీ విద్యా సరస్వతి మాత ఆలయంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో మేడ్చల్‌కు చెందిన లింగ అవినాష్ రూ.53,100కు లడ్డూను సొంతం చేసుకున్నారు. భక్తులు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో జరిగిన ఈ వేలంలో అవినాష్ లడ్డూను దక్కించుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



# రాజవ్వ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

- **హరీశ్‌రావు ఆదేశాలతో బాధిత కుటుంబానికి తక్షణ సహాయం**

**నంగునూరు, ప్రజాస్వరం :**

కొండమరాజుపల్లి గ్రామానికి చెందిన చిరబోయిన రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన హరీశ్‌రావు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నాయకులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5 వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇస్కిల్ల సారయ్య యాదవ్, వార్డు సభ్యులు సిల్వని శ్రీనివాస్, వడితం పరశురాములు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు రాజవ్వ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# వినాయక నిమజ్జనం బందోబస్తుపై సిబ్బందికి బ్రీఫింగ్

- **నిమజ్జన వాహనాలపై ప్రత్యేక పర్యవేక్షణ**
- **వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు**
- **జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు...**

**మెదక్ సెప్టెంబర్ 24 (ప్రజా స్వరం)**

వినాయక నిమజ్జనం సందర్భంగా మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్ లో బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, చెరువుల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, నిమజ్జన వాహనాలు నిర్దేశించిన మార్గాల్లోనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా పర్యవేక్షించాలని సూచించారు.చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ అన్నారు. కొంటూర్ చెరువు వద్ద గజ ఈతగాళ్లు, అత్యవసర స్పందనా సిబ్బంది, ఫైర్ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధులు నిర్వహించే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి లు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు సందీప్ రెడ్డి, మహేష్, కృష్ణ మూర్తి, రేణుక, శైలెందర్, ఎసై లు సిబ్బంది ఉన్నారు









# మోదీ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

**మెదక్ సెప్టెంబర్ 24 (ప్రజా స్వరం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ గౌస్ ఖురేషి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వయోవృద్ధుల సంక్షేమం, పోషకాహారంపై
# అవగాహన కల్పించాలి

- **అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం, జాతీయ పోషణ్ మాహ్ పోస్టర్ల ఆవిష్కరణ**

**సిద్దిపేట, ప్రజాస్వరం :**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026, 9వ జాతీయ పోషణ్ మాహ్-2026 కార్యక్రమాల సందర్భంగా రూపొందించిన పోస్టర్లను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి లక్ష్మీ కిరణ్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి శారద, పోషణ్ అభియాన్, జిల్లా హెల్ప్ డెస్క్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవనంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వారికి చేరువ చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం, సామాజిక భద్రతపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.అదేవిధంగా 9వ జాతీయ పోషణ్ మాహ్-2026లో భాగంగా జిల్లాలో వివిధ పోషకాహార అవగాహన కార్యక్రమాలు, సమన్వయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పోషకాహారంపై అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వయోవృద్ధులు సహా అన్ని వర్గాల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పేర్కొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

- **గబ్బిలాల పేటలో పలు సర్వే నెంబర్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 24, (ప్రజా-స్వరం):**

జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాల పేటలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో కలిసి జవహర్ నగర్ లోని గబ్బిలాల పేటలోని సర్వేనెంబర్ 185,285, 299,300 భూములను పరిశీలించారు. కోర్టు కేసులు ఇతర అంశాలపై వెంటనే నివేదిక సమర్పించాలని కాప్రా ఎమ్మార్వో మతిన్ ను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆధార్ కార్డు లేని విద్యార్థులకు ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేసి ఆధార్ కార్డులు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి, మండల విద్యాశాఖ అధికారి ఆజాముద్దీన్, కాప్రా రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పలువురు అధికారులు స్థానికులు పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999